# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 22-04-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఢిల్లిలో ఈరోజు పలువురు కేంద్ర మంత్రులతో భేటీ కానున్నారు.**
2. **తెలంగాణ రాష్ట్రంలో ఉత్తమ పారిశ్రామిక విధానం, ప్రపంచ స్థాయి మౌలిక వసతులు ఉన్నాయని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు.**
3. **అధునాతన సౌకర్యాలతో నూతన సంక్షేమ హాస్టళ్లు నిర్మించాలని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి సంబంధిత అధికారులను ఆదేశించారు.**
4. **దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలోనే ధాన్యం కొనుగోళ్లు సకాలంలో జరుగుతున్నాయని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.**
5. **ఆంధ్రప్రదేశ్ లో గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల హాల్‌టికెట్లు విడుదల చేసినట్లు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటించింది.**

==========================

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఢిల్లిలో ఈరోజు పలువురు కేంద్ర మంత్రులతో భేటీ కానున్నారు. వ్యక్తిగత పర్యటన నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి విదేశాలకు వెళ్లిన ఆయన నిన్న అర్ధరాత్రి ఢిల్లీ చేరుకున్నారు. విమానాశ్రయంలో ఆయనకు కేంద్రమంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీలు లావు శ్రీకృష్ణ దేవరాయలు, కలిశెట్టి అప్పలనాయుడు తదితరులు స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ రోజు రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలు, ప్రాజెక్టుల గురించి చర్చించేందుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా, జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్, న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్‌ను కలవనున్నారు.

--------------------------

తెలంగాణ రాష్ట్రంలో ఉత్తమ పారిశ్రామిక విధానం, ప్రపంచ స్థాయి మౌలిక వసతులు ఉన్నాయని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు. జపాన్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి ఒసాకా ఎక్స్‌పోలో తెలంగాణ పెవిలియన్‌ను ప్రారంభించారు. ఈ వేదికపై రాష్ట్ర ప్రత్యేకతలు, పారిశ్రామిక అనుకూలతలు, పర్యాటక ఆకర్షణలు చాటిచెప్పేలా ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి బృందం ఒసాకో ఎక్స్‌పోలో పారిశ్రామికవేత్తలతో భేటీ అయ్యింది. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని జపాన్ వ్యాపారవేత్తలను ముఖ్యమంత్రి ఆహ్వానించారు. రేవంత్‌రెడ్డి ఈరోజు ఒసాకా నుంచి హిరోషిమా వెళ్లనున్నారు.

---------------------------

అధునాతన సౌకర్యాలతో నూతన సంక్షేమ హాస్టళ్లు నిర్మించాలని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి సంబంధిత అధికారులను ఆదేశించారు. వెలగపూడి సచివాలయంలో నిన్న సాంఘిక సంక్షేమ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. హాస్టళ్ల మరమ్మతులు, కొత్త హాస్టళ్ల నిర్మాణంపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ...అధునాతన సౌకర్యాలతో హాస్టళ్ల భవనాలు నిర్మిస్తామన్నారు. ఈ ఏడాది నవంబర్ లోపు హాస్టళ్ల నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపారు.

---------------------------

దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలోనే ధాన్యం కొనుగోళ్లు సకాలంలో జరుగుతున్నాయని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. నిజామాబాద్‌లో మూడు రోజులపాటు జరగనున్న రైతు మహోత్సవాన్ని నిన్న మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి , జూపల్లి కృష్ణారావులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఆర్థిక ఇబ్బందులున్నా 2 లక్షల వరకూ రుణాలు మాఫీచేశామని .......త్వరలోనే రైతు భరోసా నిధులు కూడా కర్షకుల ఖాతాలో జమచేస్తామని ఆమన వెల్లడిస్తూ...

..వాయిస్..28 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల హాల్‌టికెట్లు అందుబాటులోకి వచ్చాయి. మే 3 నుంచి 9వ తేదీ వరకు జరిగే ఈ పరీక్షలకు సంబంధించిన హాల్‌టికెట్లను విడుదల చేసినట్లు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటించింది. మొత్తం ఏడు పేపర్లుగా నిర్వహించే ఈ పరీక్షలు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరగనున్నాయి. రాష్ట్రంలో మొత్తం 81 గ్రూప్ -1 పోస్టుల భర్తీకి గతేడాది మార్చి 17న ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించారు. మొత్తం లక్షా 48 వేల 881 మంది ప్రిలిమ్స్‌కు దరఖాస్తు చేసుకోగా.. వీరిలో 4వేల 496మంది మెయిన్స్‌కు అర్హత సాధించారు.

---------------------------

దేశంలో ప్రతిష్ఠాత్మకమైన ప్రధానమంత్రి అవార్డును 2023-24 ఏడాదికి గాను ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకులాల కార్యదర్శి ప్రసన్న వెంకటేశ్ అందుకున్నారు. 'సివిల్ సర్వీస్ డే' సందర్భంగా ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించిన వికసిత్ భారత్ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని తీసుకున్నారు. పరిపాలనలో ఉత్తమ పనితీరు కనబరిచిన దేశంలోని 10 జిల్లాల కలెక్టర్లకు ఈ అవార్డును కేంద్రం అందిస్తుంది. ప్రసన్న వెంకటేశ్ 2022 జనవరి నుంచి 2024 జులై వరకు ఏలూరు జిల్లా కలెక్టర్‌గా పనిచేశారు. ఆ సమయంలో ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, మహిళలు, బాలికల్లో రక్తహీనత నివారణకు కృషి చేయడంతో పాటు గర్భిణులు, బాలింతల ఆరోగ్య సంరక్షణకు ఆయన పాటుపడ్డారు.

కాగా .. తెలంగాణ నుంచి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని నార్నూర్ మండలాన్ని బ్లాక్ ఆస్పిరేషనల్ ప్రోగ్రాంలో భాగంగా ఆరోగ్యం, పోషణ, వ్యవసాయం, సామాజికాభివృద్ధి, మౌలికవసతుల కల్పన వంటి విభాగాల్లో

అభివృద్ధిపథంలో నిలిపారు. నార్నూర్ 'ప్రధానమంత్రి ప్రజాస్వామ్య పరిపాలన ఉత్తమ పురస్కారం–2024' కింద ఎంపికైంది. ఇందుకుగాను కలెక్టర్‌కు ఈ అవార్డు దక్కింది.

---------------------------

మే 2వ తేదీన అమరావతి పునర్నిర్మాణానికి వస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ.... లక్ష కోట్ల విలువైన పనులకు ప్రారంభోత్సవం చేస్తారని మంత్రుల కమిటీ తెలిపింది. ప్రధానమంత్రి పర్యటన ఏర్పాట్లపై మంత్రులు నాదెండ్ల మనోహర్, పయ్యావుల కేశవ్, నారాయణ, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రధాని శ్రీకారం చుట్టిన తర్వాతి రోజు నుంచే పనులు ప్రారంభమవుతాయని వెల్లడించింది. పర్యటనను విజయవంతం చేసేందుకు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని కమిటీ ఆదేశించింది. అనంతరం మంత్రి నారాయణ పాత్రికేయులతో మాట్లాడుతూ..

..వాయిస్..30 సెకన్లు

---------------------------

భూభారతి ద్వారా ప్రతి రైతుకు న్యాయం జరుగుతుందని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. నల్గొండ జిల్లా చందంపేటలో నిర్వహించిన భూ భారతి చట్టం అవగాహన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ నెలాఖరుకి నాలుగు మండలాల్లో పైలట్ ప్రాజెక్టులు పూర్తి అవుతుందన్నారు. మే1 తేదీ నుంచి జిల్లాకి ఒక్క మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఏర్పాటు చేస్తామన్నారు.

..వాయిస్.. 33 సెకన్లు....

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో రాగల 24 గంటల్లో పలు జిల్లాల్లో అకాల వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం వెల్లడించింది. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది.

కాగా... తెలంగాణలో ఈరోజు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

======================